క్లుప్తంగా

అవతార్ మెహర్ బాబా జయంతి ఉత్సవాలు



మెహర్ బాబా చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న భక్తులు

విజయనగరం: అవతార్ మెహర్ బాబా సందేశాలు విశ్వఖ్యాతిని పొందాయని, తమ పర భేదం లేకుండా కులమతాలకు అతీతంగా అందరూ కలసి మెలసి జీవించాలని అవతార్ మెహర్ బాబా సెంటర్ కార్యదర్శి ఎన్.వి.రమణమూర్తి అన్నారు. బాబా గారి 125వ జయంతి వేడుకలు స్థానిక ఉల్లి వీధి ఆర్యవైశ్య వెల్ఫేర్ భవనంలో నిర్వహించారు. జయంతి మహోత్సవాలు ప్రపంచమంతటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభ్యులు చెక్కా త్రినాథ్ గారి సౌజన్యంతో బాబా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం అధ్యక్షుడు కె.రామారావు పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి.

ఆరోగ్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం: జూలై నుండి ఫిబ్రవరి వరకు 28 ఆరోగ్య శిబిరాలను నిర్వహించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షురాలు ఉమా బాలాజీ తెలిపారు. శ్రీశ్రీశ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. బీపీ, సుగర్ తనిఖీలలో సుమారు 250 మంది పాల్గొన్నట్లు చెప్పారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, కమ్యూనిటీ డైరెక్టర్ రాధికారాణి, దేవాలయం కమిటీ కార్యదర్శి పెంటపాటి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

'భోజనం' బాగుండాలి



వసతిగృహంలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ గిరిబాల సూచించారు. మండలంలోని అలుగోలు బాలుర వసతిగృహాన్ని మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న రాత్రి భోజన నాణ్యతను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజన నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని సిద్ధం చేయాలని అన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను ఇవ్వొద్దని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ హెచ్ భానోజీరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజం నిర్మిద్దాం

జామి: లింగ వివక్ష లేని సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్ ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లింగ వివక్షత, పౌష్టికాహారం, సఖి గ్రూపులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలపై లింగవివక్షత చూపరాదని, మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలని కూడా చదివించి సమాజంలో ఎదగనిచ్చేలా గ్రామాల్లో ప్రజలను చైతన్య వంతం చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై దృష్టిసారించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. రక్తహీనత సమస్య రాకుండా ఉండేందుకు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. 9 నుంచి 21 ఏళ్ల లోపు ఆడ పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సఖీ గ్రూపుల్లో ఆడపిల్లలు చేరాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్, ఆరోగ్య సహాయకులు లత, వైద్య సిబ్బంది సత్యప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు నిహారిక, లిఖిత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

జామి: 2022 ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ఇంకా మండలంలో రైతుల వద్ద ధాన్యం ఉంటే వాటి కొనుగోలు ప్రక్రియనను రెండు రోజుల్లో పూర్తి చేయాలని వ్యవసాయశాఖ జేడీ వి.టి. రామారావు వ్యవసాయ అధికారులకు సూచించారు. మండలంలోని జన్నివలస, వి.ఆర్. పాలెం గ్రామాల రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)ను మంగళవారం ఆయన సందర్శించారు. ఇప్పటివరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు, తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు వ్యవసాయ సహాయకులతో ఆయన మాట్లాడుతూ రబీ 202 2-23 సీజన్‌కి సంబంధించి సాగులో ఉన్న పంటల ఈ- క్రాప్ నమోదు, రైతుల ఈకేవైసీ బుధవా రం సాయంత్రం లోగా శతశాతం పూర్తి చేయా లని సూ చించారు. ఈకేవైసీ పూర్తయిన రైతులు తాము సాగుచేసిన అపరాల పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని తెలిపారు.

సచివాలయ సేవలు మెరుగుపరచండి



భోగాపురం: ప్రజలకు అందిస్తున్న సచివాలయ సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

- కలెక్టర్ సూర్యకుమారి

భోగాపురం: సచివాలయ సేవలను మెరుగుపరచాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. మండలం కేంద్రంలోని సచివాలయం - 1తో పాటు జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు, సర్వీస్ రిజిస్టర్, ప్రజలకు అందిస్తున్న సచివాలయ సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది బాధ్యతతో పని చేసి, సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా మొత్తంగా 2,800 మంది సిబ్బంది సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నారని, వీరిలో కొంతమంది ఇంజినీరింగ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ ఉద్యోగాలను వదిలి వివిధ పరీక్షలకు సిద్ధమవుతున్నారని, ప్రస్తుతానికి జిల్లాలో 100 మంది వరకు సిబ్బంది కొరత ఉందని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదన్నారు. అత్యవసర సమయంలో మాత్రమే సెలవులు వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. బైజూస్ యాప్‌ను వంద శాతం ఉపయోగించే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించి తాగునీరు, విద్యుత్, సౌకర్యాల కల్పన, ఇతరత్ర విషయాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఈఓ రామకృష్ణనాయుడు, హెచ్‌ఎం వైదా శ్రీరామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బాదిపేట సచివాలయాన్ని తనిఖీ

విజయనగరం: సచివాలయాల ద్వారా అందించాల్సిన సేవలు పెండింగ్ ఉంటే సహించేది లేదని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. మంగళవారం బొబ్బాదిపేట సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. బీఎల్ఓతో మాటలాడి వార్డులో ఎంత మంది ఓటర్లు ఉన్నారు.. ఎంతమంది మరణించిన వారున్నారు.. ఎంతమంది ఆధార్ అనుసంధానం జరిగిందనే వివరాలను అడిగారు. 40 శాతం వెరిఫికేషన్ జరిగినట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీస్‌తో మాట్లాడుతూ సఖి సమావేశాల వివరాలను, సమావేశాలకు వచ్చే స్పందన పై ఆరా తీశారు. సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. పలు సేవల కోసం అందిన దరఖాస్తుల వివరాలను, ఎన్ని పెండింగ్ ఉన్నాయి, ఎందుకు పెండింగ్ ఉన్నాయన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. మ్యూటేషన్, సివిల్ సప్‌లెస్ట్ దరఖాస్తులు పెండింగ్ ఉండటం గుర్తించి వెనువెంటనే పరిష్కరించాలన్నారు.

బీసీలకు సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నేతలు

- జీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నడిపేన

విజయనగరం: బీసీలకు సామాజిక న్యాయాన్ని నిజం చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంఘం రెడ్డి బంగారు నాయుడు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు రామారావు, పార్టీ జోనల్ ఇన్‌చార్జి ముచ్చు శ్రీనివాసరావు అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేస్తున్న ప్రతి అడుగులో సామాజిక న్యాయం తన విధానం అన్నది ప్రస్ఫుటంగా కనిపిస్తోందన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాలకుగాను 11 బీసీలకు కేటాయించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించిన సామాజిక మహా విప్లవమని అన్నారు. రాజ్యాధికారంలో బీసీలకు వాటా కల్పించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని అన్నారు. దేశంలో సామాజిక న్యాయం అనే పదాన్ని నినాదంలా కాకుండా తమ విధానమని ముఖ్యమంత్రి చాటి చెబుతున్నారని అన్నారు. జిల్లాలో బీసీల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. సంక్షేమంలో 50% బీసీలకు అమలు చేయడం గొప్ప విషయమని అన్నారు. సమావేశంలో నగర పార్టీ అధ్యక్షుడు ఆసపు వేణు, కార్పొరేటర్ పతివాడ గణపతి, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి చలుమూరి ఫణి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ బీసీల పక్షపాతి

భోగాపురం: రాష్ట్రంలోని 18 ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి 11 స్థానాలను బీసీ అభ్యర్థులకు కేటాయించి బీసీల పక్షపాతి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారని రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమే కాకుండా కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్లను నియమించారన్నారు. 11 ఎమ్మెల్సీ స్థానాలను బీసీలకు కేటాయించడం అభినందనీయమని, రాష్ట్ర చరిత్రలోనే ఇది ప్రథమమని అన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో అత్యధికంగా బీసీలకు 11 స్థానాలు కల్పించి, రాష్ట్రంలో ఉన్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకులకు చట్టసభల్లో బీసీల సమస్యలపై పోరాడే అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలందరూ కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఏపీ స్టేట్ రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యావత్ భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ బీసీలకు ఇంత పెద్ద ఎత్తున పదవులిచ్చిన చరిత్ర లేదని, అది ఒక్క జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

5 నుంచి ముత్యాలమ్మ అమ్మవారి మహోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: కొత్తపేటలో వేంచేసియున్న శ్రీముత్యాలమ్మ 71వ జాతర మహోత్సవాలు మార్చి 5 నుంచి 9వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటూ జరుగుతాయని శ్రీ ముత్యమాంబ కల్చరల్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దాల భాస్కర రావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ప్రతి రోజూ అమ్మవారికి వివిధ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మార్చి 9వ తేదీన ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య అమ్మవారి ఘటములు నిలుపుతామన్నారు. అదే రోజు సాయంత్రం అమ్మవారు ఊరేగింపు ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి పెద్దింటి అప్పారావు, ప్రతినిధులు ఒమ్మి రమణ, ఆలయ పురోహితుడు కర్రి రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో మాతృ భాష దినోత్సవం



మాట్లాడుతున్న సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ రాజు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం వీసీ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ తెలుగు ఉచ్చారణ క్లిష్టతరమైనప్పటికీ భారతదేశంలో హిందీ తరువాత ఎక్కువ మాట్లాడేది తెలుగు భాష అని అన్నారు. ప్రాచీన చారిత్ర నేపథ్యం కలిగిన తెలుగు భాషను ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 70 మిలియన్ల ప్రజలు మాట్లాడుతున్నారని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష అమ్మ వంటిందని, అంతరించిపోతున్న భాషలలో తెలుగు భాష ఉందని ఐక్యరాజ్య సమితి ప్రకటించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్స్ ప్రయాణికుడికి అందజేత

విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సుంకర వెంకటేష్ అనే వ్యక్తి తన బంధువులను బస్ ఎక్కించేందుకు మంగళవారం వచ్చారు. బస్సు ఎక్కించిన తర్వాత తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో పర్స్ కాంప్లెక్స్ ఆవరణలో పడిపోయింది. అది గమనించిన ఆర్టీసీ సిబ్బంది సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఆ వ్యక్తి కాంప్లెక్స్‌కి వచ్చి పర్స్ పోయిన సంగతి అధికారులకు తెలియజేయడంతో విధి నిర్వహణలో ఉన్న స్టేషన్ మేనేజర్ రామరాజు ఎస్టీఐ దుర్యోధనల చేతుల మీదుగా పర్స్‌ను బాధితునికి అందజేశారు. పర్స్‌లో రూ.7200 నగదు, ఏటీఎం, పాన్ కార్డ్ తదితర వస్తువులున్నాయని తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



పర్స్‌ను బాధితునికి అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

మండల సమావేశం రేపు

డెంకాడ: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి మంగళవారం తెలిపారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

విజయనగరం ఫోర్ట్: గిరిజన బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నేచర్ సంస్థ వ్యవస్థాపకుడు బాలరాజు కృషి చేశారని ఆ సంస్థ ప్రతినిధి జి.కె.దుర్గ అన్నారు. స్థానిక లార్డ్ కిచనరీ ఎంపీపీ పాఠశాలలో మంగళవారం బాలరాజు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1992లో నేచర్ సంస్థను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో నేచర్ సంస్థ ప్రతినిధులు మీనా, కృష్ణారావు, అనిల్, సెంచూరియన్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదివి డ్రాపౌట్ అయిన విద్యార్థులు ఓపెన్ స్కూల్‌లో జాయిన్ కావటానికి ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ మూడో తేదీ నుండి 17వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కోర్సులో జాయిన్ కావటానికి ఈ నెల 21 నుంచి 27వరకు, పరీక్ష ఫీజు చెల్లించటానికి మార్చి 1 నుండి 7వరకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన విద్యార్థులు వారి కళాశాల ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఆదాయం రూ.3.89 లక్షలు

శృంగవరపుకోట: మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 18, 19తేదీల్లో నిర్వహించిన జాతరకు పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంకు నడిపిన ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా ఆర్టీసీకి రూ.3,89,515 ఆదాయం వచ్చిందని డీఎం కె.రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 31 బస్సులతో ముందుగానే షెడ్యూల్ నిర్ణయించామని, పుణ్యగిరి, సన్యాసయ్య పాలెంకు 18వ తేదీ ఉదయం నుంచి 19వ తేదీ సాయంత్రం వరకు నిరంతరాయంగా బస్సులు నడిపామని పేర్కొన్నారు. 18వ తేదీన రూ.1,79,715, 19వ తేదీన రూ.2,09,800 మొత్తంగా రూ.3,89,515 ఆదాయం వచ్చిందని, 834 ట్రిప్పులు నడిపామని వివరించారు. గతేడాది రూ.3,75,626 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు రెండు రోజుల భక్తులకు ఇబ్బందులు లేకుండా విధులు నిర్వర్తించారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి పాటుపడదాం



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌ను గెలిపించే బాధ్యత పార్టీ శ్రేణుల అందరిపైన ఉందని శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం సాయంత్రం తన నివాసంలో జరిగిన రింగ్ రోడ్డు జోన్ పరిధిలో 4, 5, 6, 7, 8, 10, 19, 27, 28, 29 డివిజన్లు అలాగే 30, 31, 32, 33, 34, 35, 36 డివిజన్లకు సంబంధించి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్య కార్యకర్త కష్టపడితేనే పార్టీ విజయం సాధిస్తుందని, అలాగే కార్యకర్త సంతోషంగా ఉంటేనే పార్టీ ముందుకు వెళుతుందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల విషయంపై మాట్లాడుతూ ఓటు నమోదు కార్యక్రమం పార్టీపరంగా చేయించడం జరిగిందని, మార్చి 13న ఎన్నికల రోజున పోలింగ్ చేయించుకునే బాధ్యత కూడా పార్టీ శ్రేణులపై ఉందని అన్నారు. మార్చి 18 నుంచి గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన పనిని బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. దేశం గర్వపడే విధంగా ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ జోనల్ ఇన్చార్జిలు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు పార్టీ ఆయా విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బ్రహ్మానందం మాస్టారు సేవలు ఎనలేనివి

నెల్లిమర్ల: ఓ కళాకారుడిగా, ఉపాధ్యాయుడిగా ఆరిపాక బ్రహ్మానందం మాస్టారు చేసిన సేవలు ఎనలేనివని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, డీసీసీబీ ఉపాధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ అన్నారు. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో బ్రహ్మానందం మాస్టారి వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ కళాకారుడిగా, ఉపాధ్యాయుడిగా బ్రహ్మానందం సేవలను కొనియాడారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో ఆయన ఎన్నో బహుమతులు సాధించారని గుర్తు చేశారు. మాస్టారు జ్ఞాపకార్థం ఆగస్టులో జరజాపుపేటలో రాష్ట్ర స్థాయి నాటకపోటీలు నిర్వహిస్తామని చనమల్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన మహర్షి నాటిక అందరినీ ఆకట్టుకుంది.



బ్రహ్మానందం మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దలు

కార్యక్రమంలో ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వాసు, మిమ్స్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ ఆరిపాక శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు పొంద్రంకి సత్యనారాయణ, ఎంఎం నాయుడు, నల్లి చంద్రశేఖర్, అవనాపు సత్యనారాయణ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ తదితరులు

విజయనగరం ఫోర్ట్: అవయవదానం ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ అన్నారు. తిరుమల మెడికవర్, అవయవదాన్ ఆధ్వర్యంలో మంగళవారం అవయవదానంపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. బాలాజీ జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ తిరుమల మెడికవర్ ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవయవ దానంపై ప్రజల్లో ఎన్నో అపోహలు ఉన్నాయని తెలిపారు. విదేశాల్లో కంటే మన దేశంలో అవయవదానం చాలా తక్కువన్నారు. అమెరికా, బెల్జియం వంటి దేశాల్లో 40 శాతం మంది అవయవదానం చేస్తున్నారని, కాని మన దేశంలో కేవలం 0.8 శాతం మంది మాత్రమే అవయవదానం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 0.5 శాతం మంది మాత్రమే అవయవదానం చేస్తున్నారన్నారు. మట్టిలో కలిసే అవయవం మరొకరికి ప్రాణాలు పోస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అవయవ దాన స్టేట్ కో ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ తిరుమల ప్రసాద్, కార్డియాలజిస్టు డాక్టర్ మోహన్ మహరాజ్, డాక్టర్ పద్మకుమార డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో ఇఫ్టూ రాష్ట్ర మహాసభలు

నెల్లిమర్ల: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గీత, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి పిలుపునిచ్చారు. సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను నెల్లిమర్ల పట్టణంలోని అమరవీరుల స్మారక భవనంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించే సభలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ టి.లక్ష్మీనారాయణ, అఖిల భారత ఐఎఫ్‌టీయూ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్ తదితరులు ప్రసంగిస్తారన్నారు. జిల్లాకు చెందిన అన్ని రంగాల కార్మికులు సభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని గీత, అప్పలసూరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎం జిల్లా నాయకుడు వి.మల్లేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వి.పార్వతి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి



రోడ్డు సేఫ్టీ నియమ, నిబంధనలపై ప్లకార్డులను ప్రదర్శిస్తున్న అధికారులు

- విజయనగరం ఆర్టీఓ ఆదినారాయణ

డెంకాడ: రహదారి భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను చాలా వరకూ నియంత్రించవచ్చని విజయనగరం ఆర్టీఓ ఆదినారాయణ అన్నారు. మండలంలోని చింతలవలస ఐదవ ఏపీ ఎస్పీ బెటాలియన్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనాలు నడిపే వారు జాగ్రత్తలు, రహదారి నిబంధనలు ప్రకారం నడుచుకోవాలన్నారు. జాతీయ రహదారులపై మరింత జాగ్రత్తగా నడపాలన్నారు. ఎవరైనా ప్రమాదాలకు గురైతే వారికి సమీపంలోని ఉన్న ఆస్పత్రికి తరలించి, వారికి మానవతా దృక్పథంతో సాయం చేయాలన్నారు. రహదారి భద్రతకు సంబంధించిన నియమ నిబంధనల ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో రహదారి భద్రతా కమిటీ సభ్యులు అప్పారావు, రాంబాబు, ఆర్ఎస్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.